సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 1 । జనవరి । 2023



రహదారి మరమ్మతులు పూర్తి IIలో



పనితీరు మెరుగుపర్చుకోవాలి IIలో

సఖ్యత కుదిర్చేందుకే ఫ్యామిలీ కోర్టు IIలో



న్యూస్‌రీల్

నూతన సంవత్సర శుభాకాంక్షలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు ఆర్.గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, అహ్మద్‌ఖాన్, సబ్‌కలెక్టర్లు శుభం బన్సాల్, అభిషేక్ ఆకాంక్షించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిల్లాలోని ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

బధిర క్రీడాకారుడికి చేయూత



నగదు అందజేస్తున్న ఎస్‌ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి: మొండిగెడ్డ పంచాయతీ తోటలగొంది గ్రామానికి చెందిన కందుల గిరిబాబు బధిర క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ కనపరుస్తున్నాడు. వాలీబాల్, షాట్‌పుట్, డిస్కస్‌తో వంటి పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరుకానున్న గిరిబాబుకు గూడెంకొత్తవీధి ఎస్‌ఐ అప్పలసూరి అభినందించి, తన వంతు ప్రోత్సాహంగా రూ.3వేల నగదు అందించారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన



చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అయ్యప్ప

చింతూరు: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అయ్యప్ప భక్తులు శనివారం చింతూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా అయ్యప్ప స్వామి పుట్టుకపై తెలంగాణకు చెందిన నరేష్ అనేవ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతనిపై అక్కడి ప్రభుత్వం తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు చింతూరు ఎస్‌ఐ యాదగిరికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు భాస్కర్, మణి, ఈశ్వరాచారి, సూర్య చంద్రరావు, హిందూ ధర్మసేవా సమితి సభ్యులు నాగేశ్వరరావు, శ్రీరామ్, కాశీ, గణేష్, రెడ్డి, సోమరాజు పాల్గొన్నారు.

చెరువులవేనంలో న్యూఇయర్ సందడి



చెరువులవేనానికి తరలివచ్చిన పర్యాటకులు

చింతపల్లి: ఆంధ్రా కాశ్మీర్ లంబసింగిలో శనివారం పర్యాటకులు పోటెత్తారు. న్యూఇయర్ కావడంతో వేడుకలు జరుపుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. లంబసింగి, చెరువులవేనం, తాజంగి ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. మంచు అందాలు కనువిందు చేశాయి. ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రెండు రోజులపాటు లంబసింగిపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు. పర్యాటకుల ముసుగులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వాహన తనిఖీలు చేపడుతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులపై చర్యలు చేపట్టారు. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు.

అర్హతే ప్రామాణికం

గత ప్రభుత్వంలో పింఛనుకు దరఖాస్తు చేసుకుంటే పార్టీ నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కొన్నిచోట్ల ముడుపులు కూడా చెల్లించాల్సి వచ్చేది. మంజూరు ప్రక్రియ వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. ప్రస్తుత ప్రభుత్వంలో పరిస్థితి పూర్తిగా భిన్నం. రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా కొత్త సంవత్సరంలో 5,398 మందికి పింఛను మంజూరు చేసింది. ఆర్థిక భరోసా కల్పిస్తూ కొత్త సంవత్సరంలో వారి జీవితాల్లో వెలుగులు నింపింది.

- జిల్లాలో 5,398 మందికి కొత్త పింఛన్లు
- నూతన సంవత్సరంలో పేదలకు కానుక
- 1,25,465 మందికి చేరిన పింఛను దారుల సంఖ్య
- నేటి నుంచి పంపిణీకి రూ.34.90లు విడుదల

సాక్షి, పాడేరు: నూతన సంవత్సరంలో జిల్లాలో 5,398 మందికి కొత్తగా వైఎస్సార్ పింఛన్లను కానుకగా ప్రభుత్వం మంజూరు చేసింది. అర్హులందరికీ పింఛను సౌకర్యం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఈమేరకు జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో 5398 అర్హులను ప్రభుత్వం గుర్తించింది. వీరికి రూ.2750 చొప్పున పింఛను అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



వైఎస్సార్ పింఛన్ కానుక లోగో

మండలాల వారీగా..

జిల్లాలోని అనంతగిరిలో 321, అరకులోయలో 238, డుంబ్రిగుడలో 198, హుకుంపేటలో 335, ముంచంగిపుట్టులో 298, పెదబయలులో 305, చింతపల్లిలో 581, జి.మాడుగులలో 310, జీకే వీధిలో 600, కొయ్యూరులో 242, పాడేరులో 347, అడ్డతీగలలో 181, ఎటపాకలో 136, చింతూరులో 215, దేవీపట్నంలో 197, గంగవరంలో 200, కూనవరంలో 83, మారేడుమిల్లిలో 63, రాజవొమ్మంగిలో 201, రంపచోడవరంలో 206, వీఆర్‌పురంలో 40, వై.రామవరం మండలంలో 101 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరైందని అధికారవర్గాలు తెలిపాయి.



పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు

1,25,465 మందికి పింఛన్ సొమ్ము విడుదల

జిల్లాలోని లక్షా 25 వేల 465 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము రూ.34 కోట్ల 90లక్షల 27వేల 250ను ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి నెల నుంచి పింఛన్ సొమ్మును రూ.2750కు పెంచింది. పింఛన్ సొమ్ము రూ.250 పెరగడంతో సామాజిక పింఛన్‌దారులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛను మంజూరుతో భరోసా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక పింఛన్ మంజూరు చేయడంతో ఆర్థిక భరోసా ఏర్పడింది. రెండు కళ్లు చిన్నప్పటి నుంచి కనిపించవు. గతంలో శస్త్రచికిత్స నిమిత్తం పెద్దాస్పత్రులకు వెళ్లినా ఫలితం లేకపోయింది. కంటి చూపులేక ఇంటికి పరిమితం అయ్యాను. గతంలో పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకుంటే అర్హత ఉన్నా గత ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఈ పరిస్థితుల్లో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్నా. సాంకేతిక సమస్యను సచివాలయ ఉద్యోగులు సరిచేయడంతో దివ్యాంగుల కోటాలో పింఛను మంజూరైంది.

– జి.శైలజ, రంగశీల, హుకుంపేట మండలం

అర్హులందరికీ కొత్త పింఛన్లు



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుకను అమలు జేస్తున్నాం. గ్రామ సచివాలయాలతో పాటు, స్పందనలో దరఖాస్తులన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు అర్హులందరికీ సామాజిక పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకున్నారు. ఈనెల నుంచి పెరిగిన రూ.250తో కలుపుకుని రూ.2750 ను వలంటీర్ల ద్వారా ఆదివారం ఉదయాన్నే లబ్ధిదారులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్

పార్కింగ్‌కు స్థలం కేటాయింపు

బొర్రా గుహల వద్ద ప్రారంభించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



పార్కింగ్ ప్రదేశాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమీత్‌కుమార్

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు సౌకర్యార్థం వాహనాలు నిలిపేందుకు కేటాయించిన పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ సర్పంచ్ అప్పారావు, అధికారులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనాల పార్కింగ్ వల్ల వచ్చే ఆదాయంతో పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. పార్కింగ్ ప్రదేశంలోని మాత్రమే వాహనాలకు టికెట్లు ఇచ్చి, డబ్బులు తీసుకోవాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశంలోని వాహనాలకు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు విక్రయించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఇప్పటికే పర్యాటక ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌తో పారిశుధ్యం, చెత్తచెదారం తొలగింపు పనులకు చర్యలు చేపట్టామన్నారు. పార్కింగ్ స్థలం ఏర్పాటుచేసిన ఎంపీడీవో శ్రీహర్షిత్, సర్పంచ్ అప్పారావును అభినందించారు. ఎన్నోఏళ్లగా స్థానికంగా ఉంటూ వాహనాలు నడుపుకుంటున్న తమకు పార్కింగ్ మినహాయింపు ఇవ్వాలని బొర్రా ట్రైబల్ మోటార్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. రైల్వేశాఖ సర్వే నిర్వహించి, బీసాయిగుడ కాలనీవాసులను, హోటళ్లను ఖాళీచేయాలని నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారని తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ శెట్టి నీలవేణి, తహసీల్దార్ రాంబాయి, ఎంపీటీసీ అరుణ, కోఆప్షన్ సభ్యుడు మదీనా, ఎస్‌ఐ కరక రాము, కార్య దర్శులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, అధికారులు

మండల పరిషత్ భవనం ప్రారంభం

మండల కేంద్రం అనంతగిరిలో రూ. 95 లక్షలతో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ భవనాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ రూతుతో కలిసితో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతగిరిని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నూతన భవనానికి అన్ని మౌలికవసతులు కల్పిస్తామని చెప్పారు. ఫర్నిచర్‌కు రూ.2 లక్షలు కేటాయించారు. తాగునీటికి బోరు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం పూర్తి అయ్యేందుకు కలెక్టర్ సహకారం ఎంతో ఉందన్నారు. ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే రూ.15 లక్షలు మంజూరు చేశారని, మండల పరిషత్ నుంచి మరో రూ.15 లక్షలు వెచ్చించామని పేర్కొన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, డ్వామా పీడీ రమేష్‌రామన్, వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, జెడ్పీటీసీ గంగరాజు, ఎంపీటీసీలు తొటినాయుడు, అశోక్, కోఆప్షన్ సభ్యుడు మదీనా, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, పీఆర్ ఏఈ మాణిక్యం పాల్గొన్నారు.

పదవుల కేటాయింపులో మహిళలకు ప్రాధాన్యం

అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



ప్రమాణ స్వీకార పత్రాన్ని చదువుతున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: ప్రభుత్వ పదవుల్లో మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో శనివారం నూతన చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, వైస్ చైర్మన్ యుర్మియా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఉన్నతమైన పదవుల్లో నిలబెట్టి మహిళా పక్షపాతిగా వ్యవహరించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. ఎస్సీ ఎస్టీ, మైనారిటీ, బీసీల్లో అనేక పదవులు మహిళలకు కేటాయించినట్లే స్థానిక మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రెండవ సారి మహిళలకు కేటాయించారన్నారు. గిరిజన ప్రాంతంలో మార్కెట్ కమిటీ సేవలు ఎంతో ముఖ్యమైనవన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. పదవుల్లో ఉన్న వారంతా ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని పనిచేస్తే తగిన గుర్తింపు వస్తుందన్నారు.

మంచి పేరు తెచ్చుకుంటా

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మంచి పేరు తెచ్చుకుంటానని రాజులమ్మ అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మాట్లాడారు. ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనవంతు సేవ చేస్తానన్నారు. సభ్యులందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తనకు పార్టీలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు నర్సింగరావు, ఎంపీపీలు అనూషాదేవి, బోయిన కుమారి, బడుగు రమేష్, జెడ్పీటీసీలు పోతురాజు బాలయ్య, వారా సూకరాజు,మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, బి.లక్ష్మణ్, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో లాలం సీతయ్య, కో ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, డైరెక్టర్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే వేగవంతం

జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాసరావు



భూరీసర్వే వివరాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాసరావు

డుంబ్రిగుడ: భూ రీసర్వేను వేగవంతం చేయాలని, మ్యుటేషన్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో,ఆర్‌ఐలతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి రీసర్వే వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వేను వేగవంతం చేయడమే కాకుండా మిగిలిన గ్రామాల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తూనే మ్యుటేషన్ల వేగవంతం చేయాలని ఆదేశించారు. పొరబాట్లు దొర్లితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ ముజిబ్, ఆర్‌ఐ హరి, వీఆర్వోలు ఝాన్సీ,రవి,ప్రసాద్ పాల్గొన్నారు.

150 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం

పెదబయలు: మండలంలో ఎనిమిది గ్రామ పంచాయతీల పరిధిలో 150 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి తోటలను ధ్వంసం చేసినట్టు జి.మాడుగుల సీఐ ఏ. సత్యనారాయణ తెలిపారు. రెండు రోజుల నుంచి మండలంలో కుంతుర్ల, పెదకోడాపల్లి, బొంగరం, ఇంజరి, గిన్నెలకోట, గోమంగి, గుల్లేలు, జామిగుడ పంచాయతీలో గంజాయి తోటలు ధ్వంసం చేసినట్టు ఆయన పేర్కొన్నారు.కొండవాలులో నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తున్నారని తెలిపారు. ఎక్కువగా రిజర్వు అటవీ ప్రాంతాల్లో సాగు చేస్తున్నట్టు గుర్తించామని ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు నిర్మూలనే లక్ష్యంగా..

డుంబ్రిగుడ: అరకు సర్కిల్ పరిధిలో గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగు నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని అరకు సీఐ దేముడుబాబు వెల్లడించారు. మండలంలోని సాగర పంచాయతీ టిక్కిలిబెడ్డ, సున్నంమెట్ట గ్రామాల్లో శనివారం దాడులు నిర్వహించారు. గంజాయి తోటలను ఆయన ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. రెండు ఎకరాల్లో గంజాయి తోటలను నరికి కాల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు నిరోధించాలని మొదటి తప్పుగా భావించి సాగుదారులకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మరోసారి సాగు చేస్తే అటువంటి వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. సాగర పంచాయతీ కేంద్రంలో పోలీసు పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్, పోలీసులు, మహిళ పోలీసులు సీత్తమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



గంజాయిని తగులబెడుతున్న అరకు సీఐ దేముడుబాబు, సిబ్బంది



ఇంజరి పంచాయతీలో గంజాయి తోటలను ధ్వంసం చేస్తున్న సీఐ సత్యనారాయణ,సిబ్బంది

పనితీరు మెరుగుపర్చుకోవాలి

• డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశం

జి.మాడుగుల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది పనితీరు మెరుగు పర్చుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా ఆదేశించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రసవాలు, ఆస్పత్రిలో వసతులు వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, రవి చంద్రశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ప్రకాష్, రవికుమార్, యూడీసీ సకల నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిలో రూపాయి బియ్యం నేటి నుంచి ఉచితం

సాక్షి, పాడేరు: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం పంపిణీ చేస్తున్న కిలో రూపాయి బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితం చేస్తూ నిర్ణయం తీసుకుందని జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ శనివారం తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి పేదల బియ్యం కార్డులకు ఉచిత బియ్యం పంపిణీ ఆమల్లోకి వస్తుందన్నారు. ఇక నుంచి పైసా కూడా చెల్లించకుండా రేషన్ బియ్యాన్ని ఉచితంగా పొందవచ్చన్నారు. పంచదార, కందిపప్పులకు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలని సూచించారు.

పాపికొండలు విహారయాత్రకు పోటెత్తిన పర్యాటకులు

దేవీపట్నం: పాపికొండలు అందాలను వీక్షించేందుకు శనివారం 383 మంది పర్యాటకులు తరలివెళ్లారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులు రాజమహేంద్రవరం నుంచి పోశమ్మగండికి చేరుకున్నారు. పర్యాటకశాఖకు చెందిన సర్‌ఆర్థర్ కాటన్ బోట్‌తో పాటు మరో ఆరు ప్రైవేట్ బోట్లలో పేరంటపల్లికి తరలివెళ్లారు, తిరిగి సాయంత్రం నిర్దేశించిన సమయానికి పోశమ్మగండికి చేరుకున్నారు.

రోప్‌వే ఏర్పాటు ప్రదేశం పరిశీలన



రోప్‌వే ఏర్పాటుచేసే స్థలాన్ని పరిశీలిస్తున్న పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్

అనంతగిరి: మండలంలోని బొర్రా పంచాయతీ కొయిటిగుడ వద్ద అడ్వంచర్ టూరిజంలో భాగంగా రోప్‌వే ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని శనివారం పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ పరిశీలించారు. సర్వే నెంబర్ 8లోని సుమారు 7.70 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటుకు పర్యాటక శాఖ కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపడంతో పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి రోప్‌వే నిర్మించబోయే ప్రాంతాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించిన రికార్డు, మ్యాప్‌లను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ రాంబాయి, ఆర్‌ఐ నల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

గిరి విజ్ఞాన సంబరాల్లో సత్తాచాటిన విద్యార్థులు



గిరిజన విజ్ఞాన సంబరాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది



ప్రశంసాపత్రాలు, బంగారు పతకాలతో విద్యార్థులు



వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

పెదబయలు: పాడేరు డివిజన్ కేంద్రంలో మూడు రోజులుగా జరిగిన గిరిజన విజ్ఞాన సంబరాల్లో పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 విద్యార్థులు ఆంగ్లం, గణితం, సైన్స్ విభాగాల్లో ప్రతిభ సాధించారనిహెచ్‌ఎం నాగేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు ప్రదర్శించిన ప్రాజెక్టుల్లో ఆంగ్లం నుంచి ప్రథమ బహుమతి, సైన్స్ విభాగంలో స్మార్ట్ డ్రగ్స్ డిటెక్టర్‌కు ద్వితీయ స్థానం, గణితంలో ఆల్‌జిబ్రా నమూనాకు తృతీయ బహుమతిని విద్యార్థులు సాధించారని, కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్టు చెప్పారు. పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయులు కొర్ర రవి కుమార్ గిరిజన విజ్ఞాన సంబరాల్లో ప్రధాన వ్యాఖ్యాతగా వ్యవహించారన్నారు. ఆయా విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

డ్రాయింగ్‌లో బంగారు పతకాలు

రాజవొమ్మంగి: ఇటీవల కోనసీమ చిత్ర కళా పరిషత్ (అమలాపురం)నిర్వహించిన బాలల చిత్రలేఖనం పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు చెప్పారు. మరో 44 మంది మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను, డ్రాయింగ్ టీచర్ కొండబాబును పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు అభినందించారు.

వాలీబాల్ విజేతలకు అభినందనలు

చింతపల్లి: గిరి విజ్ఞాన సంబరాల్లో భాగంగా పాడేరులో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో చింతపల్లి బాలికల పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. బాలికల సీనియర్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి విజయం సాధించినట్లు పీఈటీ వరలక్ష్మి తెలిపారు. గెలుపొందిన బాలికలను హెచ్‌ఎం కొండలరావు, వార్డెన్ నూకరత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

సఖ్యత కుదిర్చేందుకే ఫ్యామిలీ కోర్టు

• పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్



ఫ్యామిలీ కోర్టులో బాధిత కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

సాక్షి,పాడేరు: భార్యాభర్తల గొడవలు, కుటుంబ తగాదాలు తదితర సమస్యలు పరిష్కరించాలన్న లక్ష్యంతోనే ఫ్యామిలీ కోర్టును నిర్వహిస్తున్నామని పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని ఏజెన్సీ సబ్‌జడ్జి కోర్టులో ఫ్యామిలీ కోర్టు సేవలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అనుభవజ్ఞులైన న్యాయవాదుల సమక్షంలో పలు ఫ్యామిలీ కేసులకు సంబంధించి ఆయా కుటుంబాలను సబ్‌కలెక్టర్ విచారించారు. చిన్నపాటి గొడవలకు భార్యాభర్తలు విడిపోతే పుట్టిన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని, సఖ్యతతో మెలిగి సంతోషంగా జీవించాలని హితవు పలికారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్, న్యాయవాదులు కౌన్సెలింగ్ నిర్వహించారు. భార్యాభర్తల గొడవలకు సంబంధించిన కేసుల్లో కొన్నింటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో వివాదాలకు పోతున్న భార్యాభర్తలు,ఇతర కుటుంబాలకు కౌన్సెలింగ్ జరిపి, వారంతా కలిసి ఉండేలా చేసేందుకే ఫ్యామిలీ కోర్టు సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించామన్నారు. ప్రతీ నెలలో ఒక శనివారం ఫ్యామిలీ కోర్టు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బండారు వెంకటరమణ, విశాఖకు చెందిన పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడు సోమాగాంధీకి తీవ్ర అస్వస్థత

• మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం నుంచి విశాఖకు తరలింపు
• ఎంపీ మాధవి, శివప్రసాద్ దంపతులకు బాధిత కుటుంబసభ్యుల కృతజ్ఞతలు



అంబులెన్స్‌లో ఎంపీటీసీ సభ్యుడు సోమాగాంధీతో మాట్లాడుతున్న శివప్రసాద్

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, శరభన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు లోకుల సోమాగాంధీ శనివారం తీవ్ర అస్వస్థకు గురయ్యారు. శుక్రవారం రాత్రి శరభన్నపాలెంలో తీవ్ర అస్వస్థతకు గురైన గాంధీని ఎంపీ భర్త, నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు శివప్రసాద్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి, నర్సీపట్నం ఆస్పత్రిలో చేర్పించారు. సుగర్‌స్థాయి పడిపోవడంతో శనివారం నర్సీపట్నం నుంచి విశాఖలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీ మాధవి స్పందించి, ఆమె వెంటనే తన భర్త శివప్రసాద్ ద్వారా అంబులెన్స్ ఏర్పాటు చేయించారు. విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రి చికిత్స పొందుతున్న సోమాగాంధీకి ఫోన్‌లో ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. తక్షణమే స్పందించి అన్ని విధాల సాయం చేసిన ఎంపీ దంపతులకు గాంధీ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యాటక ప్రాంతాల్లో వీకెండ్ సందడి



వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సాక్షి, పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు శుక్రవారం రాత్రి నుంచి సందర్శకులు పోటెత్తారు. వీకెండ్‌తోపాటు న్యూ ఇయర్ వేడుకలకు ముందస్తుగానే పర్యాటకులు మన్యంలోని పర్యాటక ప్రాంతాలకు తరలివచచారు. లంబసింగి, తాజంగి, జి.మాడుగుల, పాడేరు.హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మండలాల్లోని అన్ని పర్యాటక ప్రాంతాలకు శనివారం ఉదయం నుంచే పర్యాటకులు బారులు తీరారు. చెరువులవేనం, వంజంగి, సీతమ్మకొండ, మాడగడ హిల్స్ ప్రాంతాల్లో సూర్యోదయం.పొగమంచు,మేఘాల కొండల్లో ప్రకృతి అందాలను తిలకించారు. జిల్లాలోని అన్ని పర్యాటక, ప్రైవేట్ అతిథి గృహాలు, రిసార్ట్‌లు, హోటళ్లు, లాడ్జీలు పర్యాటకులతో నిండిపోయాయి.

లఘు చిత్రాల పోటీలు

తుమ్మపాల: జిల్లాలో సాంస్కృతిక, సామాజిక, పర్యాటక సంపద అనే అంశంపై లఘు చిత్రం (షార్ట్ ఫిలిం) పోటీలు నిర్వహిస్తున్నట్లు సహాయ కలెక్టర్ ధాత్రిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోగా లఘు చిత్రాలను అందజేయాలన్నారు. వీటి నిడివి ఐదు నుంచి పది నిమిషాలు ఉండాలన్నారు. జిల్లా సహజ సౌందర్యం, ఆధ్యాత్మిక ప్రదేశాలు, సాంస్కృతి, చరిత్ర, యూఎస్‌పీ అంశాలపై చిత్రీకరించాలన్నారు. పోటీల్లో పాల్గొన్న వారిలో ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులతోపాటు సత్కారం చేస్తామన్నారు. విజేతల లఘు చిత్రాలను పట్టణంలోని నిర్వహించే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామన్నారు.

రహదారి మరమ్మతులు పూర్తి

• రూ.59 లక్షలతో మారేడుమిల్లి-చింతూరు రోడ్డు పనులు
• ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

మారేడుమిల్లి : మారేడుమిల్లి నుంచి చింతూరు వెళ్లే రహదారిలో పాములేరు గ్రామ సమీపంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారికి మరమ్మతు పనులు పూర్తయినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ మారేడుమిల్లి-చింతూరు వెళ్లే ప్రధాన అంతర రాష్ట్ర రహదారి అధ్వానంగా ఉండేదన్నారు. అంతర రాష్ట్ర రోడ్డు కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండేవని తెలిపారు. వర్షంకాలంలో రోడ్డుపైన గుంతల్లో నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదని పేర్కొన్నారు. సమస్యను గుర్తించి ఆర్‌అండ్‌బీ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామని పీవో తెలిపారు. దీంతో రూ. 59 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు.కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో రెండు వారాల్లో మరమ్మతుల పనులు పూర్తి అయ్యాయని ఆయన పేర్కొన్నారు. మరమ్మతు పనులను గతంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించారని పీవో వివరించారు.

పరుగుతో ఆరోగ్యం మెరుగు

జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా పరిశ్రమల శాఖాధికారి నవీన్‌కుమార్, అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాస్

పాడేరు రూరల్ : పరుగుతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి పేరూరి శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని అగ్నిమాపక శాఖ సిబ్బందికి శనివారం పాడేరు ఘాట్ రోడ్డులో పరుగు పోటీలను జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నవీన్‌కుమార్‌తో కలసి జెండా ఊపి ప్రారంభించారు. నక్కలపుట్టు చెక్‌పోస్టు నుంచి గరికబంద చెక్‌పోస్టు వరకు సుమారు 26 కిలోమీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. వీటిలో నవీన్‌కుమార్ 10 కిలోమీటర్ల మేర పరిగెత్తారు. అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ సహచర సిబ్బందితో కలిసి 26 కిలోమీటర్ల పరుగును మూడు గంటల్లో పూర్తి చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ పరుగుతో ఆరోగ్యం మెరుగని పేర్కొన్నారు. లీడింగ్ ఫైర్‌మేన్ ఎల్ఎల్ బాలకృష్ణ, హోంగార్డు కె. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో భూరీసర్వేపై సూచనలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సాల్

గంగవరం: భూముల రీసర్వే నిర్వహించే గ్రామాల్లో రెండు, మూడు రోజుల ముందుగానే బృందాలు పర్యటించి, సమస్యలు గుర్తించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్ మాట్లాడుతూ భూములు రీ సర్వే పక్కాగా జరగాలన్నారు. ముందుగా గుర్తించిన సమస్యల ఆధారంగా సర్వే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. గ్రామస్తులకు రీసర్వేపై అవగాహన కల్పించాలన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు గంగవరం మండలంలో 12 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసినట్టు రెవెన్యూ అధికారులు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ తేజస్వని. ఆర్ఐ పయాజ్‌భాషా, మండల సర్వేయర్ దొర , వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



అరకులోయలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.శనివారం పాడేరు మండలం మినుములూరులో 12డిగ్రీలు, చింతపల్లిలో 13డిగ్రీలు, అరకు లోయలో 13.4డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పాటు,చలిగాలులు విజృంభిస్తున్నాయి.

ఇసుక లారీ సీజ్

చోడవరం రూరల్: వడ్డాది నుంచి చోడవరానికి అక్రమంగా ఇసుక లోడు చేసి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దుడ్డుపాలెం గ్రామానికి చెందిన రమణ లారీలో ఇసుక లోడు తరలిస్తుండగా హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి సిబ్బందితో దాడి చేశారు. కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.